# ప్రపంచ శక్తిగా నిలిపే బడ్జెట్

## సంక్షేమం, దేశాభివృద్ధిని జోడెడ్ల బండిలా తీసుకెళ్తుంది: కిషన్ రెడ్డి

- **కల్వకుంట్ల కుటుంబానికి కాదు.. ప్రజలకు జవాబుదారీగా ఉంటా**




**న్యూఢిల్లీ, వెలుగు:** దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి గొప్ప బడ్జెట్ పార్ల మెంట్ లో ప్రవేశ పెట్టారని కేంద్ర పర్యాటక, సాం స్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దేశ శక్తి, సామర్థ్యాలను సద్వినియోగం చేసుకునేలా.. ప్రపంచ శక్తిగా భారత్ ను నిలిపే కోణంలో బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో యూనియన్ బడ్జెట్ లోని ముఖ్య అంశాలపై మీడియాతో మాట్లాడారు. సంక్షేమాన్ని, దేశాభివృద్ధిని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని చెప్పారు. "దీన్ దయాళ్ ఉపాధ్యాయ కలలుగన్న అంత్యోదయ.. మహాత్మాగాంధీ కలలుగన్న రామరాజ్యం, గరీబ్ కల్యాణ్, సహకార విధానం.. రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలైన మహిళలు, యువత సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి ఆధునిక సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, రక్షణ, మౌలిక వసతుల కల్పన, పర్యాటకాభివృద్ధి ఇలా ప్రతి రంగాన్ని స్పృశిస్తూ.. ఇన్క్లూజివ్ గ్రోత్ టార్గెట్ తో ఈ బడ్జెట్ ను రూపొందించారు" అని ఆయన అన్నారు.

**త్వరలో ఎపిగ్రఫీ మ్యూజియం**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న మంచిని చూడలేని స్థితిలో కల్వకుంట్ల కుటుంబం ఉందని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. రూ. 26వేల కోట్ల విలువైన రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఏర్పాటుకు భూసేకరణ విషయంలో 5 లేఖలు రాసినా కేసీఆర్ స్పందించలేదన్నారు. ఆర్ఆర్ఆర్ హైదరాబాద్ గేమ్ చేంజర్ గా అభివర్ణించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ కు అప్రోచ్ రోడ్డు విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని, కాజీపేట రైల్వే ఓవర్ హాలింగ్ కేంద్రం భూసేకరణ విషయంలోనూ ఇలాగే వ్యవహరించిందని తెలిపారు. కేసీఆర్ కుటుంబ స్వార్థ రాజకీయాల కారణంగా తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా రైల్వేలకు రికార్డు స్థాయిలో 2.02 లక్షల కోట్లను కేంద్రం కేటాయించిందన్నారు. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, శిలాశాసనాలను డిజిటలైజ్ చేసే 'భారత్ శ్రీ' పథకంలో భాగంగా హైదరాబాద్ లో ఎపిగ్రఫీ మ్యూజియంను ఏర్పాటుచేయనున్నట్లు ఆయన తెలిపారు.

# దేశ ప్రగతి, అభివృద్ధిని నిర్దేశించే బడ్జెట్

## తెలంగాణకు కల్వకుంట్ల కుటుంబమే శాపం: కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 1:** కేసీఆర్ కుటుంబం ఉన్నన్ని రోజులు రాష్ట్రానికి నష్టమే తప్ప ఏమాత్రం మేలు జరగదని, తెలంగాణకు కల్వకుంట్ల కుటుంబమే పెద్ద శాపమని కేంద్ర పర్యాటక,సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను భారత దేశ బడ్జెట్‌గానే చూడాలే గానీ కొన్ని రాష్ట్రాల బడ్జెట్ కాదని స్పష్టం చేశారు. బడ్జెట్‌పై బీఆర్ఎస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేయడంపై కిషన్‌రెడ్డి స్పందించారు.



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న విషయాలను చూడలేని స్థితిలో కల్వకుంట్ల కుటుంబం ఉందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రీజినల్ రింగ్ రోడ్డుకు భూసేకరణ ఖర్చులో సగం కేంద్రం ఇస్తామని చెప్పినా, మిగతా సగం కూడా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణంలో భూసేకరణ ఖర్చు రాష్ట్రాలు భరిస్తాయని, ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు కేంద్రం ముందుకొచ్చినా రాష్ట్ర సర్కార్ నుంచి స్పందన లేదన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా ఇవ్వడం లేదని, 3వేల మందికి ఉపాధి కల్పించే రైల్వే ఓవర్హాలింగ్ యూనిట్ మంజూరు చేయిస్తే, అప్రోచ్ రోడ్ ఇవ్వడం లేదని తెలిపారు.

రూ.6 కోట్ల ఖర్చుతో కట్టిన యూరియా ప్లాంట్ ప్రారంభోత్సవానికి కూడా ప్రభుత్వం తరపున ఎవ్వరూ రాలేదని వెల్లడించారు. సైన్స్ సిటీ మంజూరు చేసుకుని ల్యాండ్ కోసం లెటర్ల మీద లెటర్లు రాసినా స్పందన లేదని, కనీసం లెటర్ అందినట్లు జవాబు కూడా లేదని ఆయన విమర్శించారు.

భారతదేశ గతం, వర్తమానాలను పరిగణలోకి తీసుకుంటూ ఉజ్వలమైన భవిష్యత్తును కాంక్షిస్తూ నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గతంలో ఎన్నడూ లేనంతగా రైల్వేలకు రికార్డు స్థాయిలో 2.02 లక్షల కోట్ల రూపాయలను కేటాయించడం, రైల్వేల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

# నేను తెలంగాణ ప్రజలకే జవాబుదారీ

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- నన్ను విమర్శించే నైతిక హక్కు కల్వకుంట్ల కుటుంబానికి లేదు
- తెలంగాణకు ఆ కుటుంబం పెద్ద శాపం



**సాక్షి, న్యూఢిల్లీ:** గత నాలుగేళ్లుగా తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసి ప్రాజెక్టులు మంజూరు చేయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టులకు అవసరమైన కనీస వసతులు కల్పించకుండా అభివృద్ధికి మోకాలడ్డుతోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తాను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ అని.. కల్వకుంట్ల కుటుంబానికి ఏ మాత్రం కాదని అన్నారు. తనను విమర్శించే నైతిక హక్కు కల్వకుంట్ల కుటుంబానికి ఉందా? అని ప్రశ్నించారు. బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు విషయంలో భూసేకరణ ఖర్చులో కూడా సగం భరిస్తామని కేంద్రం ముందుకొచ్చినా.. మిగతా సగం నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. ఎంఎంటీఎస్ ఫేజ్–2కు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా ఇవ్వడంలేదన్నారు. 3 వేల మందికి ఉపాధి కల్పించే రైల్వే ఓవర్హాలింగ్ యూనిట్‌ను మంజూరు చేయిస్తే, అప్రోచ్ రోడ్‌కు భూమి ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్లపల్లి టెర్మినల్ నిర్మాణానికి అవసరమైన పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇస్తున్నప్పటికీ అక్కడ కూడా అప్రోచ్ రోడ్డుకు భూమి ఇవ్వట్లేదన్నారు. ఆఖరుకు రామగుండంలో ప్రధానమంత్రి యూరియా ప్లాంట్ ప్రారంభోత్సవానికి వస్తే అక్కడికి కూడా రాకుండా మొహం చేటేసినవాళ్లు చెప్పే నీతులు మాకు అవసరమా..? అని ప్రశ్నించారు. తెలంగాణకు కల్వకుంట్ల కుటుంబం ఒక పెద్ద శాపమని అన్నారు. తెలంగాణ ప్రజలంతా తమకు బానిసలు అనే విధంగా కల్వకుంట్ల కుటుంబం నిజాం మాదిరిగా వ్యవహరిస్తోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# సహకార బడ్జెట్

- సబ్‌కా ప్రయాస్ ఆలోచనకు ప్రతిరూపమిది
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** భారతదేశ గతం, వర్తమానాలను పరిగణనలోకి తీసుకుంటూ ఉజ్వలమైన భవిష్యత్తును కాంక్షిస్తూ నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌ను భారతదేశ బడ్జెట్‌గానే చూడాలే గానీ కొన్ని రాష్ట్రాల బడ్జెట్ కాదని స్పష్టం చేశారు. బడ్జెట్‌పై టీఆర్ఎస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేయడంపై కిషన్ రెడ్డి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న విషయాలను చూడలేని స్థితిలో కల్వకుంట్ల కుటుంబం ఉందని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి స్వప్నమైన 'అమృత్‌కాల్' నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు వేస్తున్న ముందడుగు దేశాన్ని అన్నిరకాలుగా సిద్ధం చేసే దిశగా ఈ బడ్జెట్‌కు ప్లానింగ్ జరిగిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని, దేశాభివృద్ధిని జోడెడ్ల బండిగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్‌కు రూపకల్పన జరిగిందన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ కలలుగన్న అంత్యోదయ, మహాత్మాగాంధీ కలలుగన్న రామరాజ్యం, గరీబ్ కల్యాణ్, సహకార విధానాన్ని, మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలైన మహిళలు, యువత సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి ఆధునిక సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, రక్షణ, మౌలికవసతుల కల్పన, పర్యాటకాభివృద్ధి ఇలా ప్రతి రంగాన్ని స్పృశిస్తూ.. భారతదేశ సమ్మిళిత అభివృద్ధి (ఇన్-క్లూజివ్ గ్రోత్) లక్ష్యంతో ఈ బడ్జెట్ ను రూపొందించారన్నారు.